క్లుప్తంగా

వ్యాన్ టైర్లు చోరీ



శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో బుధవారం వ్యాన్ టైర్లు చోరీకి గురయ్యాయి. ఎరడపల్లి గ్రామానికి చెందిన భూతం సంపత్ ఇనుప సామానుతో పాటు డబ్బాలు కొనుగోలు చేస్తూ తాడికల్‌లో కొన్ని రోజులగా నివాసం ఉంటున్నాడు. మంగళవారం కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి పక్కన వ్యాన్ పార్కింగ్ చేశాడు. బుధవారం తెల్లవారుజామున వ్యాను ముందు టైర్లు కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మద్యం పట్టివేత

జమ్మికుంట: మండలంలోని అంకూషాపూర్ గ్రామంలో బెల్టు షాపుల నుంచి మద్యం పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.1,400, మరో వ్యక్తి వద్ద రూ.2,600 విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు.

హాస్టల్ ఘటనపై విచారణ

శంకరపట్నం: మండలంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలోని ఘటనపై బుధవారం ఇంటలిజెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. కూరలు రుచిగా లేవంటే కొడుతున్నారనే కథనం బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైంది. దీంతో ఇంటలిజెన్స్ అధికారులు స్పందించి విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకునేందుకు కామాటి రాంప్రకాశ్ ప్రవర్తనపై విచారణ చేపట్టారు. కామాటి మద్యం సేవించిన ఘటనపై ఆరా తీసినట్లు సమాచారం.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న వెంకటేశ్

ఇల్లందకుంట: మండలంలోని బూజునూరు గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఎడ్ల వెంకట్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సరిగొమ్ముల వెంకటేశ్ బుధవారం రూ.5,000 అందజేశారు. కనగర్తి గ్రామానికి చెందిన కంచెం హరీశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబానికి హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ తరుపున 50 కిలోల బియ్యం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బండి మల్లేశ్, వీరారెడ్డి, బాబు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘం వార్షిక సభ

శంకరపట్నం: మండల కేంద్రంలోని మహిళా పొదుపు సంఘం 25వ వార్షిక మహాసభ బుధవారం నిర్వహించారు. సంఘం ఆర్థిక లావాదేవీలను గణకులు చదివి వినిపించారు. ఈసమావేశంలో అధ్యక్షురాలు పావని, మహిళా సంఘం అధ్యక్షురాలు ఉమాదేవి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వకర్మల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సింగారం ప్రేమ్‌కుమార్

హుజూరాబాద్: విశ్వకర్మల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ పేదల ఆర్థిక రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సింగారం ప్రేమ్‌కుమార్ అన్నారు. పట్టణంలో జిల్లా అధ్యక్షుడు బోరుగల్ల సమ్మయ్య అధ్యక్షతన బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల అన్ని కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన తరుణంలో విశ్వకర్మల కార్పొరేషన్ సైతం ఏర్పాటు దిశగా ఆలోచన చేసి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీలకు వాహనరుణాలు విడుదల చేసి ఆదుకోవాలన్నారు. యువత డ్రగ్స్, గంజాయి వైపు మళ్లకుండా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి రఘుచారి తదితరులు ఉన్నారు.

హైనా దాడిలో దూడ మృతి

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలం నవాబ్‌పేట్‌లో మర్రి ఐలయ్యకు చెందిన దూడ మంగళవారం రాత్రి హైనా దాడిలో మృతి చెందింది. వ్యవసాయ పొలం వద్ద ఉన్న పశువుల పాకలోకి బుధవారం వెళ్లి చూడగా దూడ మృతి చెందిఉందని ఐలయ్య తెలిపాడు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. హైనా దాడిలోనే దూడ మృతి చెందిందని ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

కల్యాణం.. కమనీయం



రామడుగు: వెలిచాలలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం



రామడుగు: వెదిరలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



తిమ్మాపూర్: శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



తిమ్మాపూర్: కల్యాణానికి హాజరైన భక్తులు



మానకొండూర్‌రూరల్: పూజలు చేస్తున్న భక్తులు

నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి భారీగా భక్తుల హాజరు

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ శ్రీసీతారామలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలంకరణ చేశారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిపించారు. ఆలయ చైర్మన్ లక్ష్మణ్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈవో ఉడుతల వెంకన్న కల్యాణానికి సంబంధించి అన్నిరకాల ఏర్పాట్లు చేశారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అల్లర్లు, దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. కల్యాణానికి ఏటా గ్రామానికి చెందిన తమ్మిశెట్టి మల్లయ్య అన్నదానం నిర్వహించేవారు ఇటీవల ఆయన మరణించడంతో ఆయన కుమారుడు హరి తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, రామకృష్ణ, లక్ష్మణ్, అభిరామ్, ఈవో ఉడుతల వెంకన్న, ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని వెల్ది గ్రామంలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం వేదమంత్రాల సాక్షిగా పండితులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను పల్లకీపై డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించి దేవాలయానికి తరలించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విశ్వనాథాచారి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ పద్మ, మాజీ సర్పంచ్ లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెదిర, వెలిచాలలో...

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి, వెలిచాలలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవం వేదపండితులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి పద్మశాలీ సంఘం సభ్యులు తలంబ్రాలు తీసుకువచ్చారు. కల్యాణోత్సవంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రామడుగు తహసీల్దార్ భాస్కర్, కరీంనగర్ కార్పొరేటర్ బండ సుమ, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, దేవాలయాల అభివృద్ధి కమిటీల చైర్మన్లు వీర్ల ప్రభాకర్‌రావు, చెన్నమనేని రాజేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ వీర్ల కవిత, మాజీ ఎంపీపీ వంచ సుదర్శన్‌రెడ్డి, కల్యాణోత్సవ నిర్వాహకులు వంగళ శ్రీనివాస్‌రెడ్డిశారద దంపతులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చేతికందే సమయంలోనే..

- అకాల వర్షం.. అపార నష్టం
- ఏటా దెబ్బతింటున్న మొక్కజొన్న, వరి పంటలు, మామిడితోటలు
- ఆరేళ్లుగా అందని ప్రభుత్వ సాయం
- జాడలేని కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమా
- నష్టపోతున్న రైతులు



ఖాసీంపేటలో నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో కిరణ్మయి



మాదాపూర్‌లో మామిడితోటను పరిశీలిస్తున్న వ్యవసాయ, రెవెన్యూఅధికారులు

గన్నేరువరం: రైతులపై ప్రకృతి కన్నెర్ర చేస్తుంది. ఏటా అకాల వర్షాలు, వడగండ్లు, ఈదురుగాలులతో వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయల పంటలకు అపారనష్టం జరుగుతోంది. ప్రభుత్వం నుంచి పరిహారం మాత్రం అందడం లేదు. మండలంలో గతంలో పంటలు పండక నష్టపోయిన రైతులు మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి కుడి కాల్వకు సాగు నీటి విడుదలతో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. అష్టకష్టాలు పడి పంటలను కాపాడుకుంటూ వస్తుంటే పంటలు చేతికందే సమయంలో వడగండ్ల వానలతో రైతులకు అపార నష్టం వాటిల్లుతుంది. అధికారులు మాత్రం 33 శాతానికి పైగా పంట నష్టం జరిగితేనే పరిహారం అందుతుందనడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టం జరిగింది ఇలా...

2018లో మార్చి, ఏప్రిల్‌లో కురిసిన వడగండ్లు, అకాల వర్షాలతో 150 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామడితోటలు, 2019లో 180 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, కూరగాయలు, 2020లో 1,237 ఎకరాల్లో వరి, ఏడు ఎకరాల్లో మొక్కజొన్న, 2021, 2022 ఏడాదిల్లో వందలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడితోటలు, 2023 మార్చి 19, 22వ తేదీల్లో 170 ఎకరాల్లో మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. 150 ఎకరాల వరకు మామిడితోటలకు నష్టం జరిగినట్లు హార్టికల్చర్ అధికారులు గుర్తించారు. ఇదే ఏడాది ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలకు 3 వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం జరిగింది. ఇకా ఈ ఏడాది మూడు రోజుల క్రితం కురిసిన వడగండ్లు, అకాల వర్షాలకు 165 ఎకరాల్లో మొక్కజొన్న, 145 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంటకు నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు.

జాడలేని ఫసల్ బీమా

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్‌బీమాను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయకపోవడంతో వాతావరణ ప్రతికూల పరిస్థితులతో పంటలు నష్టంపోతే ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా వచ్చే పంట నష్ట పరిహారం రాకుండా పోయింది. దీంతో పాటు 2018 నుంచి రైతుబంధు పథకం అమలుతో అప్పటి ప్రభుత్వం అకాల వర్షాలకు నష్టపరిహారం అందించడంలో నిర్లక్ష్యం చేస్తూ వస్తోంది. కేవలం గతేడాది మార్చిలో కురిసిన అకాల వర్షాలకు 78 ఎకరాలకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పంట నష్టపరిహారం అందించింది ప్రభుత్వం.

రైతులను ఆదుకోవాలి



అకాల వర్షాలు, వడగండ్లతో మొక్కజొన్న, మామిడి తోటలు, కూరగాయలు, పొద్దు తిరుగుడు పంటలకు ఏటా అపార నష్టం జరుగుతోంది. రైతులకు పంట పెట్టుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నాం. గత ఆరేళ్లలో కేవలం ఒకసారి మాత్రమే పంట నష్టపరిహారం అందింది. పంట నష్టం పరిహారం పూర్తి స్థాయిలో విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

– బండి తిరుపతి, రైతు, మాదాపూర్

పూర్తి స్థాయి పరిశీలన చేస్తాం



మండలంలో ఇటీవల కురిసిన వడగండ్లు, అకాల వర్షాలకు 165 ఎకరాల్లో మొక్కజొన్న, 145 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంటకు నష్టం జరిగింది. నష్టంపై గ్రామాల వారీగా పూర్తి స్థాయిలో పరిశీలన చేసి పూర్తి నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తాం. గతేడాది మార్చిలో మొక్కజొన్న, ఇతర పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించింది.

– కిరణ్మయి, వ్యవసాయశాఖ అధికారి

కేంద్ర బలగాల కవాతు, వాహనాల తనిఖీ



కాట్రపల్లిలో కేంద్ర బలగాల కవాత్తు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై సురేందర్

రామడుగు: మండలంలోని వెదిర, వెలిచాల గ్రామాలలో బుధవారం సాయంత్రం, చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్, రామడుగు ఎస్సై సురేందర్ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి వెదిర బస్టాండ్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ప్రశాంతంగా ఓటింగ్ జరిగేందుకు ప్రజలు సహకరించాలని, ఎలాంటి ఇబ్బందులున్నా సమాచారం అందజేస్తే చర్యలు తీసుకుంటాని సీఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

హుజూరాబాద్‌రూరల్: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. మండలంలోని కాట్రపల్లి గ్రామంలో బుధవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. ఎన్నికల నియమావళిని అందరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఐ రమేశ్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



కేజీబీవీ తొమ్మిదో తరగతి విద్యార్థినులతో నాగేంద్ర, తదితరులు

శంకరపట్నం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రంజీ క్రికెటర్ నాగేంద్ర అన్నారు. మండలంలోని కేజీబీవీలో తొమ్మిదో తరగతి విద్యార్థినులకు క్రీడలు–చదువుపై అవగాహన కల్పించారు. ఐటీలో చదివి కష్టపడి రంజీ క్రీడల్లో రాణించానన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా, ఇష్టమైన రంగంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీవో బషీరొద్దీన్, స్పెషల్ ఆఫీసర్ మాధవి, సెక్రెటరీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగేందుకు సబ్సిడీపై గొర్రెలు



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

గంగాధర: మండలంలోని గోపాల్‌రావుపల్లి గ్రామంలో జరుగుతున్న బీరప్ప జాతరలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం యాదవ సంఘం నాయకులతో మాట్లాడారు. గొల్ల కురుమలు ఆర్థికంగా ఎదగడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెలు అందజేసిందన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో గొల్లకురుమలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీచైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, సత్యంయాదవ్, ఐలేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డును అందజేస్తున్న అటవీశాఖ అధికారులు

జమ్మికుంట: హైదరాబాద్‌లోని కేఆర్‌బీ పార్కులో రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం కెమెరా కళ్లు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జమ్మికుంటకు చెందిన ఫొటోగ్రాఫర్ విజయగిరి రాంబాబుకు రాష్ట్రస్థాయి ద్వితీయ అవార్డును అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఎంసీ వర్గీస్, కన్జర్వేటర్ ఎం.శివాని డోగ్రా అందజేశారు. కెమెరా కళ్లు ప్రోగ్రాం ద్వారా అటవీసంపద, వన్యప్రాణులు, పక్షుల ఫొటోలను కెమెరాలో నిక్షిప్తం చేసినందుకు బహుమతి ప్రదానం చేశారు. కాగా జమ్మికుంట ఫొటోగ్రాఫర్ రాంబాబుకు పట్టణ ప్రముఖులు, పలువురు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

జమ్మికుంట చేయూత ఫౌండేషన్ సభ్యులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న అబేదభాను

జమ్మికుంట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించకొని హైదరాబాద్ రవీంద్రభారతిలో మా గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ అవార్డు సెలబ్రేషన్‌లో జమ్మికుంట చేయూత ఫౌండేషన్(ఎన్‌జీఓ) వ్యవస్థాపకుడు దూడపాక శ్రీనివాస్‌కు ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవా పురస్కార్ అవార్డు, సభ్యులు అభేద బాను,శిరీషలకు రాణి రుద్రమదేవి సేవా పురస్కార్ జాతీయ స్థాయి అవార్డులను మాక్ష్‌గ్లోబల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దినేశ్ చెరపల్లి చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ కరోనా సమయంలో రోగులకు సేవలు, మహిళలకు ఉపాధి కల్పన, స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీలతో పాటు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు అవార్డులు అందించారని అన్నారు. బుధవారం పట్టణంలోని స్వచ్ఛంద సంస్థ సభ్యులు, సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు వీరిని అభినందించారు. కార్యక్రమంలో మిస్ ఏసియా ఇంటర్నేషనల్ రష్మి థాకూర్, సరిగమ సింగర్ జీ తెలుగు ఫేమ్ పార్వతి, రాజుగాడు మూవీ డైరెక్టర్ సంజనారెడ్డి, ఏపీ ఉమెన్ కమిషన్ మెంబర్ రుకియా ప్రముఖులు పాల్గొన్నారు.

కరీంనగర్ మిల్క్ డెయిరీ సందర్శన

కరీంనగర్‌సిటీ: ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కామర్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ, వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య ఆధ్వర్యంలో కామర్స్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా కరీంనగర్ మిల్క్ డెయిరీని సందర్శించారు. రైతుల వద్ద నుంచి తీసుకొచ్చిన పాలను ప్రాసెస్ చేసే విధానం పరిశీలించారు. ఈ పర్యటన విజయవంతం చేసినందుకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ కామర్స్ డిపార్ట్‌మెంట్‌ను అభినందించారు.

ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ తనిఖీ



సీఐ, ఎస్సైతో మాట్లాడుతున్న సీపీ అభిషేక్‌మహంతి

తిమ్మాపూర్: ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌ను సీపీ అభిషేక్‌మహంతి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్‌కేంద్రాలను విధిగా సందర్శించి, లోటుపాట్లు ఉంటే పైఅధికారులకు తెలపాలన్నారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లతో పాటు గత ఎన్నికల సమయంలో జరిగిన గొడవల ఆధారంగా బాధ్యులను గుర్తించి, వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. సీపీ వెంట తిమ్మాపూర్ సీఐ స్వామి, ఎల్ఎండీ ఎస్సై చేరాలు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో ముందుకెళ్లాలని పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు బుధవారం పార్టీలో చేరగా కండవాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. చేరిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కన్నెబోయిన శ్రీనివాస్, బాషబోయిన మొగిళి, సమ్మయ్య, సింగిల్ విండో డైరెక్టర్ కుర్ర చేరాలు, రాజు, సారయ్య, సదానందం, సమ్మయ్య, దేవేందర్, మోహన్, 50 మంది బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన దక్షిణామూర్తి వ్యాపారనిమిత్తం హుజూరాబాద్ వెళ్తున్న క్రమంలో గ్రామశివారులో ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. అటుగా వెళ్తున్న ప్రణవ్ క్షతగాత్రుడిని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హుండీల ఆదాయం లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న వలంటీర్లు

ఇల్లందకుంట: అపరభద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం హుండీలను బుధవారం లెక్కించగా 45 రోజులకు రూ.4,04,434 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కందుల సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ డివిజన్ దేవాదాయశాఖ పరిశీలకుడు సత్యనారాయణ, అర్చకులు, సిబ్బంది, శ్రీ రామసేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.